క్లుప్తంగా

ఈఈ బాధ్యతల స్వీకరణ


ఈఈ భాస్కర్ నాయుడు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ ఈఈగా భాస్కర్‌నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లాలో కన్‌స్ట్రక్షన్ డీఈఈగా పనిచేస్తున్న ఆయన ఇటీవల ఈఈగా ఉద్యోగోన్నతి పొందారు. ఉద్యోగోన్నతి అనంతరం చిత్తూరుకు బదిలీ అయిన ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఆన్‌లైన్ భారం తగ్గించాలి


సమావేశంలో పాల్గొన్న సంఘమిత్రలు

చిత్తూరు కార్పొరేషన్ : సంఘమిత్రలపై ఆన్‌లైన్ భారం తగ్గించాలని ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంఘమిత్రలపై పనిభారం పెంచేందుకు అనేక రకాల యాప్‌లు తీసుకొచ్చి ఇబ్బందులు సృష్టిస్తోందన్నారు. ఆన్‌లైన్ వర్క్ చేయడానికి 5జీ సిమ్ములు ఇవ్వకుండా ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. సంఘమిత్రలకు చెల్లించాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్టోబర్ 1 నుంచి సంఘమిత్రలు ఆన్‌లైన్ నిలిపివేతను జయప్రదం చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ సంఘమిత్రల సమస్యలపై దృష్టి పెట్టకుండా అలసత్వం వహించడం దారుణమన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ బాబు, జిల్లా నాయకులు మమత, అగస్టి, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేను వేగవంతంచేయండి

పూతలపట్టు(యాదమరి): మండలంలో పీ4 సర్వేను వేగవంతం చేసి బంగారు కుటుంబాలను గుర్తించాలని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సర్వేపై ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఓ శ్రీనివాసులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సూరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆర్థికంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలను గుర్తించి వారి ఆర్థిక స్థితిగతులు మార్చడానికే ఈ పీ4సర్వే, ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ శిక్షణ ద్వారా సచివాలయ సిబ్బందికి ప్రజా సేవలను అందించడంలో మరింత పారదర్శకత, సమర్థత పెరుగుతుందన్నారు. అనంతరం ప్రత్యేక శిక్షకుల ద్వారా సిబ్బందికి సర్వేపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత అని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో అన్నిరకాల వ్యాధులు, మహిళలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు చేయించి వైద్యం చేయిస్తామన్నారు. ప్రజలు ఆరగ్యో వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న భద్రకాళి ఉత్సవం

గుడిపాల: మండలంలోని నరహరిపేట సమీపంలో గల భద్రకాళమ్మ 47వ సంవత్సర మహోత్సవం ఈనెల 28వ తేదీన వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు వసంతాపురం గ్రామానికి చెందిన మునికాంతమ్మ, యోగపతి కుటుంబసభ్యులు అమ్మవారికి యజ్ఞం నిర్వహించడంతో పాటు మధ్యాహ్నం వచ్చిన భక్తులకు కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. రాత్రి ఆదిపరాశక్తి మిన్నల్ ఒళి శివపూజ తమిళ వీధి నాటకం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

విలీన కుట్రలు..

మూగబోనున్న రైతు సేవలు..

గత ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతులకు గ్రామాల్లోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో రైతు భరోసాకేంద్రాలను ఏర్పాటు చేసింది. గత ఐదేళ్లు అనుకున్న లక్ష్యం కంటే మెరుగైన సేవలు అందాయి. అయితే కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవలందిస్తున్న వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుంది. అధికారంలోకి వచ్చిన కొత్తలోనే కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరును రైతుసేవా కేంద్రాలుగా మార్చి విలీనం పేరిట రైతులకు వాటి సేవలను దూరం చేస్తోంది. క్రమక్రమంగా వాటిని ఎత్తేసేందుకు కుట్రలు చేస్తోంది. సొంత భవనాలు ఉన్నవాటిని కూడా విలీనం పేరిట సమీప గ్రామాల్లోని కేంద్రాల్లో కలిపేస్తోంది. దీంతో ఇప్పటిదాకా ఉన్న ఊరిలోనే సేవలు పొందిన రైతులు సుదూర ప్రాంతాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.


వసంతాపురం రైతుసేవా కేంద్రం

గత ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చడమే లక్ష్యంగా కుట్రలు

- అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాలు కాస్త రైతు సేవాకేంద్రాలుగా మార్పు
- ఇప్పుడు ఈ క్రాప్ ఆధారంగా ఆర్‌ఎస్‌కేల విలీనం
- సొంత భవనాలు ఉన్నా కూడా విలీనం పేరిట కుదింపు
- ఎరువులు, విత్తనాల కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సిందే
- రైతులకు తప్పని రవాణాభారం
- విలీనం అనంతరం మిగిలిన సిబ్బందిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తున్న సర్కారు

గుడిపాల: రాష్ట్రంలో ప్రజలకు సేవలందించే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వ్యవహరిస్తోంది కూటమి ప్రభుత్వం. గత ప్రభుత్వంలో రైతులకు విరివిగా సేవలు అందించిన రైతు భరోసాకేంద్రాల పేరును మార్చేసిన కూటమి పాలకులు.. ఇప్పుడు వాటి నుంచి విలీనం పేరిట కుదిస్తూ రైతులకు వాటి సేవలను దూరం చేస్తున్నారు. గత ఐదేళ్లు రైతులకు వారి గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు.. పంట నష్ట పరిహారం వంటి ప్రతి సేవలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఏడాదిగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం వాటి సంఖ్య తగ్గించేసింది. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 515 రైతుసేవా కేంద్రాలు ఉండగా.. విలీనం పేరిట 249 రైతు సేవా కేంద్రాలను మరో రైతుసేవా కేంద్రాల్లోకి కలిపేయడంతో ప్రస్తుతం 266 అయ్యాయి. దీంతో రైతుసేవా కేంద్రాలను తొలగించిన గ్రామాల్లోని రైతులు పక్క గ్రామాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఈ– క్రాప్ ఆధారంగా విలీనం..

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు చేసిన ఈ–క్రాప్ బుకింగ్‌లను ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను విలీనం చేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఈ–క్రాప్ బుకింగ్ చేసిన విస్తీర్ణానికి, పూర్తి విస్తీర్ణానికి వ్యత్యాసం ఉంటుందని, అలాంటప్పుడు దాన్ని ప్రామాణికంగా ఎలా తీసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీఆర్వోలు, సర్వేయర్లను మాత్రం సచివాలయాల వారీగా అలాగే ఉంచి కేవలం వీఏఏలను మాత్రమే విలీనం చేయడం అన్యాయమని వారు వాపోతున్నారు. విలీనం చేసిన నేపథ్యంలో మిగిలిన వీఏఏలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ–క్రాప్ ఆధారంగా రైతు సేవా కేంద్రాలను విలీనం చేసి తిరిగి ఇప్పుడు ఏరియా మొత్తాన్ని ఈ–క్రాప్ చేయమని చెబుతుండడంతో పనిభారం పెరుగుతోందని వీఏఏలు వాపోతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

చిత్తూరు నియోజకర్గంలోని గుడిపాలలో 17, చిత్తూరు మండలంలో 9 ఆర్‌ఎస్‌కేలు ఉన్నాయి. ప్రస్తుతం గుడిపాలలో 9 చేయగా, చిత్తూరులో వాటి సంఖ్య 5కి కుదించారు. దీంతో రైతులు కిలోమీటర్ల మేర వెళ్లి రైతులు పంటలకు కావాల్సిన మందులను తెచ్చుకోవాల్సి వస్తోంది. ఒక్కో రైతు సేవా కేంద్రానికి సుమారు 5 నుంచి 8 కిలోమీటర్ల మేర వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిన్నటి వరకు అన్ని గ్రామాల్లోనే సేవలు అందించిన రైతుసేవా కేంద్రాలు ఇప్పుడు తగ్గడంతో ప్రస్తుతం యూరియా కూడా దొరక్కని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని రైతన్నలు వాపోతున్నారు.

వివరాలు..

జిల్లాలో ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాలు :	584
విలీనం చేయగా ఉన్న కేంద్రాలు :	249
ప్రస్తుతం ఉన్న రైతుసేవా కేంద్రాలు :	266

దూరం వెళ్లాల్సి వస్తుంది



గ్రామంలో ఉన్న రైతుసేవా కేంద్రాన్ని తొలగించి కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో కేంద్రానికి విలీనం చేశారు. ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవాలంటే దూరమవడంతో పాటు రవాణా ఖర్చులు అధికంగా అవుతాయి. ఏదైనా సమస్య వస్తే వ్యవసాయశాఖ సిబ్బందిని అడగాలంటే కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– మనోహర్, గుడిపాల

గ్రామంలోనే కొనసాగించాలి..



గ్రామంలో రైతు సేవా కేంద్రానికి సొంతభవనం ఉన్నప్పటికీ తొలగించి బసవాపల్లెలో విలీనం చేశారు. పొలాలకు ఎరువులు తీసుకోవాలంటే 4 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. గ్రామంలోనే రైతుసేవా కేంద్రాన్ని కొనసాగించేలా చూడాలి. రైతులకు ఇబ్బందులు ఉండవు.

– రామకృష్ణారెడ్డి, గుడిపాల

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం


మాట్లాడుతున్న సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి

చిత్తూరు కలెక్టరేట్ : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం అని ఐసీడీఎస్ సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి అన్నారు. ఈ మేరకు నగరంలోని వెంగల్‌రావుకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల ప్రాముఖ్యత – అనుబంధ ఆహారం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లిపాలే అమృతంతో సమానమని చెప్పారు. ఆ పాలలో బిడ్డకు సరిపడే పోషకాలు, వ్యాధి నిరోధక పోషకాలు ఉంటాయన్నారు. తల్లిపాల శిశువు ఆరోగ్యానికి మొదటి ఆహారమని తెలిపారు. తల్లులు తప్పనిసరిగా ఆరునెలల పాటు ప్రత్యేకంగా తల్లిపాలను ఇవ్వాలన్నారు. తల్లులు తగినంత నీరు తాగడం, సక్రమమైన ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయని తెలిపారు. శిశువు పుట్టిన అరగంట నుంచి గంటలోపు మొదటిసారి తల్లిపాలు ఇవ్వాలన్నారు. మొదటి మూడురోజులు బిడ్డకు కొలొస్ట్రమ్ ఇవ్వాలన్నారు. మొదట వచ్చే పసుపు కొలొస్ట్రమ్ పోషకాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. ప్రసవమైన మూడురోజులు తల్లిపాలు ఇవ్వకూడదనే మూఢనమ్మకం అన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోయజాక్షి, అంగన్‌వాడీ టీచర్ చిట్టమ్మ, హెల్పర్లు దివ్య, భారతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు


కార్మికులకు మందులు పంపిణీ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

చిత్తూరు అర్బన్: నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని చిత్తూరు మేయర్ అముద చెప్పారు. స్వచ్ఛతా హీ సేవా–2025 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మేయర్ అముద మాట్లాడుతూ.. కార్మికులంతా ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రాథమిక దశలోనే వైద్య సేవలు పొందడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు అపోలో వైద్యులచే ఎనిమిది విభాగాల్లో వైద్య పరీక్షలు, చికిత్సలు అందించి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ మాట్లాడుతూ 348 మంది పారిశుద్ధ్య కార్మికులు వైద్య సేవలు అందించామన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని, క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, మేనేజర్ గోపాల కృష్ణ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



గుడిపాల: ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థి దశ నుంచే సేవాదృక్పథం అలవరచుకోవాలని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ (జాతీయ సేవా పథక) దినోత్సవాన్ని నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల, పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ నేటి యువత సమాజ సేవ పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ మానవీయ విలువలు నేర్పి, సమాజం పట్ల బాధ్యతను పెంచి ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందన్నారు. పీసీఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, లెక్చరర్ చిట్టిబాబు మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్‌గా ఉండే విద్యార్థి సామాజిక కార్యకర్తగా, సమర్థవంతమైన నిర్వాహకుడిగా, నాయకుడిగా ఆత్మస్థైర్యంతో ఎలాంటి క్లిష్టపరిస్థితులనైనా ఎదుర్కొనేలా తయారవుతారన్నారు. అనంతరం పీసీఆర్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక సేవను అలవాటు చేసుకోవాలి

బంగారుపాళెం: విద్యార్థులు సామాజిక సేవను అలవాటు చేసుకోవాలని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వందనాత్రిపాఠి అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ డే(జాతీయ సేవా పథం)ని కళాశాలలో బుధవారం విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సావిత్రమ్మ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

గుడిపాల: విద్యార్థి దశ నుంచే సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని సీఎన్‌ఆర్ కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్ ,చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే మాంటోకార్లో లిమిటెడ్ అడిషనల్ జనరల్ మేనేజర్ ముఖేష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీఓ హేమంత్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డా.స్వామికణ్ణన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. 2018 నుంచి పెండింగ్ డీఏ బకాయిలు ఇవ్వాలన్నారు. డీఎస్సీ 2003 టీచర్లకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలన్నారు. పీఆర్‌సీ అమలు చేసే వరకు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈఎల్స్, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాలు తదితర అంశాలను పరిష్కరించాలన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

కారు ఢీకొని..

బంగారుపాళెం: మండలంలోని పాలేరు సరీ్వసు రోడ్డులో మంగళవారం రాత్రి ఓ ద్విచక్ర వాహనదారున్ని కారు ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలో వెలుగు చూసింది. వివరాలు.. మొగిలివెంకటగిరికి చెందిన జ్ఞానశేఖర్ పాలేరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా సర్వీసు రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జ్ఞానశేఖర్ కాలు విరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు 108లో బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భాషా పండితులకు న్యాయం చేయండి


రెడ్డి శేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న భాషా పండితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా పర్మినెంట్ స్థానాలు లేక భాషా పండితులు ఏడాదికి ఒక స్కూలు మారుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పండితులు ఉద్యోగోన్నతికి నోచుకోవడం లేదని ఆరోపించారు. హైకోర్టు ధర్మాసనం ఆదేశాల మేరకు పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆకుకూరల్లో పోషక విలువలు


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ వినుతశ్రీ

బంగారుపాళెం: గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలని సీడీపీఓ వినుతశ్రీ అన్నారు. పోషక ఆహారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని కొదలమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో తాజాగా దొరికే ఎక్కువ పోషకాలు కలిగిన వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను ప్రదర్శించారు. వాటిని తీసుకోవడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలియజేశారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సమతుల్యమైన పోషక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి శ్రేష్ఠమన్నారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు అందుబాటులో ఉంటూ పర్యవేక్షిస్తూ సేవలు అందిస్తున్నారన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా అధికంగా వాడొద్దు


పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: పంటకు అధికంగా యూరియా వాడకం వల్ల దుష్ప్రయోజనాలు అధికంగా ఉంటుందని వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని కె.పట్నం, ఈచనేరి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడకం గురించి అవగాహన కల్పించారు. రైతులు పండించే ప్రతి పంటను ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. రైతులు జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు వాడడం మంచిదని వివరించారు. అదేవిధంగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కుసుమ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తీగల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


తీగలను తొలగించడంతో శుభ్రంగా కనిపిస్తున్న దృశ్యం

గుడిపాల: ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలను విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు. గుడిపాల పశువైద్యశాల ఆవరణలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తీగలు అల్లుకుపోయి సోమవారం సాక్షి దినపత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన కథనం వెలువడింది. పశువైద్యశాలకు వస్తున్న సిబ్బంది, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈ కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం లైన్‌మెన్ మైకేల్, సిబ్బంది మహేష్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టుపక్కల ఉన్న తీగలలను తొలగించి శుభ్రం చేశారు. దీంతో స్థానికులు సాక్షికి అభినందనలు తెలిపారు.


దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. బుధవారం అమ్మవార్లకు అన్నపూర్ణదేవి అలంకరణ చేపట్టగా అమితంగా ఆకట్టకుంది. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. – చిత్తూరురూరల్(కాణిపాకం)/గుడిపాల/బంగారుపాళెం/ఐరాల

అన్నపూర్ణదేవి.. ఆశీర్వదించు


గుడిపాల: అన్నపూర్ణదేవిగా ద్రౌపదీదేవి, ఐరాల: అలంకరణలో పాలేటమ్మ, చాముండేశ్వరిదేవి, ఓంశక్తి అమ్మవారు


అన్నపూర్ణాదేవిగా వజ్రాలపురం గంగమ్మ, ముత్యాలమ్మ, మత్స్యావతారంలో కోదండరాముడు, బ్రహ్మకుమారీస్ కేంద్రంలో..